క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని సీఎంకు వినతి


సీఎంకు వినతిపత్రం ఇస్తున్న విప్ అడ్లూరి

ధర్మపురి: భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సీఎంను విప్ మర్యాదపూర్వకంగా కలిసి ధర్మపురిలో డ్రెయినేజీ నీటితో గోదావరి కలుషితమవుతోందని, మురుగు నీటి కర్మాగారం పరిపాలనా నిర్మాణం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసారు. ధర్మపురి, వేములవాడ, కొండగట్టు, కోటిలింగాల పుణ్యక్షేత్రాలను కలుపుతూ టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయాలని కోరగా, అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కొండగట్టులో డైరెక్టర్ వంశీ పైడిపల్లి పూజలు


పూజలు నిర్వహిస్తున్న డైరెక్టర్ దంపతులు

కొండగట్టు: కొండగట్టు అంజన్నను ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టి, మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు,అర్చకులు స్వాగతం పలికి దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు


ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారి

జగిత్యాల: పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం అన్నపూర్ణ థియేటర్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తున్న బండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత తప్పకుండా పాటించాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొన్ని హోంఫుడ్స్ సెంటర్ల వారికి రూ.5 వేల జరిమానా విధించారు.

బంగారు పాదుకల శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: రామరాజ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17 కిలోల బంగారు పాదుకలతో భాగ్యనగరం నుంచి అయోధ్య వరకు నిర్వహిస్తున్న పల్లకీ యాత్ర శనివారం జిల్లాలోని బండలింగాపూర్‌కు చేరుకుంది. దీనికి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక రామాలయంలో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు సంగి దేవేందర్‌రెడ్డి, సుతారి సత్యం, రేండ్ల రాజన్న, చెదలు రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌శివాలయ ఆవరణలో శనివారం అయ్యప్ప స్వామి సామూహిక పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు,అయ్యప్ప స్వాములు,భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం


జగిత్యాల: 1729 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

జగిత్యాల/రాయికల్/ధర్మపురి/మెట్‌పల్లి/కథలాపూర్/మల్లాపూర్/వెల్గటూర్/సారంగాపూర్/ ఇబ్రహీంపట్నం/బుగ్గారం/మల్యాల: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. గణిత శాస్త్రం ద్వారా వివిధ పోటీ పరీక్షల్లో విజయాన్ని చాలా సులువుగా సాధించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ గణితంపై పట్టు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన ప్రదర్శించిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. పలు చోట్ల విద్యార్థులు 1729 ఆకారంలో కూర్చున్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాయికల్ పాఠశాలలో రోబో ప్రదర్శన


ధర్మపురి: విద్యార్థుల ప్రదర్శనలు


మెట్‌పల్లిలో విద్యార్థుల ప్రయోగం

ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్


నంచర్లలో ఫుడ్ పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి


రాయికల్‌లో ఆహారపదార్థాలు పరిశీలన

కథలాపూర్/పెగడపల్లి/వెల్గటూర్/రాయికల్/మల్లాపూర్: జిల్లాలలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. కథలాపూర్ మండలం పోతారం ప్రభుత్వ పాఠశాల, మల్లాపూర్ మండలం పాతదాంరాజుపల్లి పాఠశాల, పెగడపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి తీసుకొచ్చిన వివిధ రకాల ఆహార పదార్థాలు (వంటకాలు) ఉపాధ్యాయులు పరిశీలించి, ఏయే ఆహార పదార్థాల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయో వివరించారు. రుచికరమైన వంటకాలు చేసిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా సెక్టోరియల్ అధికారి మహేశ్, ఎంఈవో సులోచన, కథలాపూర్ ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ పులి శిరీష, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ధ్యానం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల: ధ్యానంతో ప్రశాంతత లభిస్తుందని ఇంటర్ మీడియెట్ నోడల్ అధికారి నారాయణ అన్నారు. వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ నిర్వాహకులు శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు ధ్యానం చేయాలని, దాంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. డీఎస్పీ రఘుచందర్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే యోగా, ధ్యానం చేస్తే క్రమశిక్షణ అలవాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషణం, ప్రోగ్రాం నిర్వాహకులు మంచాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో శనివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానగురు గంప ప్రసాద్ ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ధ్యానం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంత గౌతమ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల: ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం చేసుకోవచ్చని ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురూజీ ఏ.కిషోర్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మానసిక ఒత్తిడి పెరగటంతో ప్రపంచానికి ధ్యానం గొప్పతనం తెలిసిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణమోహన్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత పెంపొందుతుందని శిక్షకులు మాగ్నో అన్నారు. శనివారం ఇటిక్యాలలోని నివేదిత కృష్ణారావు పిరమిడ్ క్షేత్రంలో ఓషో ధ్యాన మాగ్నో ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ధ్యాన శిబిరం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మల్యాల: అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దొంగ ఆనంద రెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి,బత్తిని శ్రీనివాస్ గౌడ్, మ్యాక లక్ష్మణ్, రామగిరి మురళీ, వీరబత్తిని ప్రసాద్, ఎండీ.ఇమామ్, ముత్యం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు: అంబేడ్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను కొడిమ్యాల మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం దహనం చేశారు. అకార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కాయిత రాజు, సత్యం, మురళీ, శేఖర్, గంగరాజం, కర్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కోరుట్ల: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ అంబేద్కర్ పై చేసిన అనుచిత వాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అంబేద్కర్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నాయకులు శనివారం జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, అంబేద్కర్ సంఘ నాయకులు కొడిపెల్లి సురేశ్, పసుల కృష్ణప్రసాద్, దాయ కొండయ్య, మగ్గిడి వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గడ్డం రమేశ్

బుగ్గారం: జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.అధ్యక్షుడిగా బుగ్గారం మండలానికి చెందిన గడ్డం రమేశ్ ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా పొన్నం రాజాగౌడ్,కోశాధికారిగా కాసం సంతోష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొడికర్ శ్రీనివాస్,రామడుగు స్వరూప, గొనపెల్లి మహేష్,మద్దెల నర్సయ్య,బొజ్జ ప్రకాష్,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా ఖలీద్‌పాషా

కథలాపూర్: యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.డీ ఖలీద్ పాషా ఎన్నికయ్యారు. శనివారం కథలాపూర్‌లో యూటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా పిట్టల రాజేందర్, ఉపాధ్యక్షులుగా రాజేశ్, షహీనా, కోశాధికారిగా శెట్టి రమేశ్, కార్యదర్శిగా చంద్రమౌళి, వోట్ కన్వీనర్‌గా విజయ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులను నాయకులు అంబటి భూమేశ్వర్, తులసి ఆగమయ్య అభినందించారు.

గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సంతోష్‌కుమార్

జగిత్యాల: హైదరాబాద్‌లోని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జగిత్యాలకు చెందిన గంగుల సంతోష్‌ను రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా టీజీవో జిల్లా అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, కార్యదర్శి రమేశ్ హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ విస్తీర్ణాధికారుల ఐక్యవేదిక ఏర్పాటు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ విస్తీర్ణాధికారుల ఐక్యవేదిక శనివారం ఏర్పాటైంది. ఈ ఐక్యవేదిక జిల్లా కార్యవర్గాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బదావత్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబారిపేట రైతు వేదికలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎండీ. పిర్దోస్, జనరల్ సెక్రటరీగా జి. శేఖర్, కోశాధికారిగా జి. హరీశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఈవోలు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్ సరెండర్ సరికాదు


ఆందోళన చేస్తున్న డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

జగిత్యాల: సీనియర్ వైద్యుడు, సూపరింటెండెంట్‌ను సరెండర్ చేయడం సమంజసం కాదని, దీనిని ఖండిస్తున్నామని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) నాయకులు అన్నారు. జగిత్యాల జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కలెక్టర్ సరెండర్ చేయగా వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కొత్తగూడెంలోనూ ఇలానే జరిగిందని, అది మరణానికి దారి తీసిందన్నారు. ఇలాంటి చర్యలు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు.

తీసిన మట్టి పోస్తానని రైతు హామీ

సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం శివారులోని డీ- 24 కాలువ పక్కన ఓ రైతు మట్టి తీయ్యడంతో ఈ నెల 17న సాక్షిలో 'కబ్జాకు గురవుతున్న కాలువ గట్టు' అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా ఎస్సారెస్పీ అధికారులు స్పందించారు. ఎస్సారెస్పీ ఏఈ సజీత్ పరిశీలించి కాలువ పక్కనే మట్టి తీసిన రైతుపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు రైతు వారం రోజుల్లో తీసిన మట్టిని కాలువ గట్టుకు పోసి ఎప్పటి లాగా చేస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చినట్లు ఏఈ తెలిపారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ తండాలో శనివారం అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్లూరి సాగర్, కూన రాకేశ్, నాయకులు పాల్గొన్నారు.

యాదవుల సంఘటితమే లక్ష్యం

జగిత్యాలరూరల్: జిల్లా వ్యాప్తంగా యాదవుల సంఘటితమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని జిల్లా యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లిలో సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సమస్యలు, యాదవుల ఐక్యత బలోపేతానికి జిల్లాలో సభ్యత్వ నమోదు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు చిర్రం ప్రకాశ్‌యాదవ్, మండల ఇన్‌చార్జి బైరి మల్లేశ్‌యాదవ్, జుర్రు శ్రీనివాస్‌యాదవ్, మహేశ్‌యాదవ్, జలేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ధరణికి విముక్తి సంతోషకరం

కథలాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ రైతుల ఉసురు తీసిందని, ధరణికి విముక్తి కలగడం సంతోషంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ అన్నారు. కథలాపూర్‌లో శనివారం మాట్లాడారు. ధరణి పోర్టల్ వల్ల భూములున్న అసలైన రైతులకు ఏళ్ల తరబడి అన్యాయం జరిగిందని, పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూభారతి ప్రవేశపెట్టడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకొని అసలైన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కబ్జా భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ముగిసిన జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు


విజేతలుగా నిలిచిన విద్యార్థులు

మల్యాల: ఎస్‌ఎస్‌వీ అల్ఫోర్స్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్ జిల్లా స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. వివిధ పాఠశాలల నుంచి 60మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆమెటి అశోక్, జూడో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


రాయికల్: పట్టణంలోని 2 వార్డులో జనవాసాల మధ్య మురికినీరు ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్,రాయికల్ సెల్ నంబర్: 7032118586

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలి


ధర్మపురి వసతి గృహం సందర్శించిన కమిషనర్

ధర్మపురి: వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ అందిస్తున్న మెనూ తప్పక పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. ధర్మపురిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, కస్తూర్బా గురుకుల పాఠశాలను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సందర్శించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు వండి పెడుతున్న భోజన సరుకులను, వంట గదులను పరిశీలించారు. రోజువారి డైట్ ప్లాన్, భోజన వసతులు సమతుల ఆహారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసి ఈ-సేవ కేంద్రాన్ని పరిశీలించారు.కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన ఉండాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న స్వప్న

జగిత్యాలరూరల్: మహిళా సాధికారతపై అవగాహన కలిగి ఉండాలని మహిళాసాధికారత టీం సభ్యురాలు స్వప్న అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థినులకు మహిళా సాధికారత టీం అవగాహన సదస్సు నిర్వహించారు. బేటి బచావో బేటి పడావో పథకం, మహిళల హక్కుల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, బాల బాలికలకు బాల్య వివాహాలవల్ల ఎంతో నష్టం జరుగుతుందని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ సాధికారత టీం సభ్యులు గౌతమి, హేమ, పాఠశాల హెచ్‌ఎం సరోజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో మహిళా సాధికారతపై జిల్లా మహిళా సాధికారత, సఖీ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు అశ్విని, లావణ్య, కరస్పాండెంట్ ప్రవీణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

• ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆర్‌సి.జాన్ రాబర్ట్, మోనా, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణ శివారులోని విధిత్‌రెడ్డి గార్డెన్‌లో శనివారం క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొని పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు.కార్యక్రమంలో అధ్యక్షుడు సామెల్ నాయక్, సతీష్, ఏలియా నాగేశ్వర్‌రావు, మేంగు, బేతు గౌతం, ఆకుల లింగారెడ్డి, జెట్టి లింగం తదితరులున్నారు.

• సీనియర్ సిటీజన్స్ సమాజ మార్గదర్శకులు

కోరుట్ల: సీనియర్ సిటీజన్స్ సమాజ మార్గదర్శకులని కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ కోరుట్ల శాఖ అధ్యక్షుడు పబ్బా శివానందం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 టేబుల్ క్యాలెండర్లు, రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ రచించిన వృద్ధుల సంరక్షణ చట్టం పుస్తకాలను ఆర్డీవో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంత రెడ్డి, రాజ్ మోహన్, నల్లా లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

• రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో సీఎం కప్ నెట్‌బాల్‌లో జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. శ్రీచరణ్, ఆదర్శ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్ కై రం సత్యంగౌడ్ అభినందించారు.

• ప్రభుత్వ పాఠశాలకు ప్యూరిఫైర్ వితరణ

రాయికల్: మండలంలోని వీరాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కన్నవేని మల్లారెడ్డి తన కుమారుడు రిషిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం పాఠశాలకు రూ.15 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. ఈ సందర్భంగా రిషిత్‌రెడ్డిని ఎంఈవో రాఘవులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నమల్లయ్య, కిషన్‌రావు, మహబూబ్, మదన్‌మోహన్ రావు, ఇబ్రహీం, వెంకటేశ్ పాల్గొన్నారు.

• మెట్‌పల్లి ఎంపీడీవోగా మహేశ్వర్‌రెడ్డి

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి ఎంపీడీవోగా మహేశ్వర్ రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో ఎన్నికల సమయంలో బదిలీ అయ్యారు. దీంతో కోరుట్ల ఎంపీడీవోగా ఉన్న రామకృష్ణ మొన్నటి వరకు మెట్‌పల్లి మండల ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కొద్దిరోజుల క్రితం ఓ అధికారికి పోస్టింగ్ ఇచ్చినప్పటికీ ఆయన పలు కారణాలతో విధుల్లో చేరలేదు. దీంతో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డిని ఎంపీడీవోగా నియమించారు.

• మినీ గురుకులంలో తహసీల్దార్ తనిఖీ

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్ మినీ గురుకులాన్ని శనివారం తహసీల్దార్ ఖయ్యూం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆహార ప్యాకెట్లను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

• విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని టౌన్-1 పరిధిలోని న్యూబస్టాండ్ ప్రాంతం, రాంబజార్, పురాణిపేట, ఎల్జీరాంలాడ్జ్, అంగడిబజార్, యావర్ రోడ్, మార్కెట్‌బ్యాక్‌సైడ్, కృష్ణానగర్, అరవింద్‌నగర్, మార్కండేయ టెంపుల్ ప్రాంతం, టాకాసంది, సాయిరాంనగర్, కరీంనగర్‌రోడ్, గోవిందుపల్లి, గణేశ్ టెంపుల్ ఏరియా, బైపాస్‌రోడ్, శ్రీరాంనగర్, వెంకటాద్రినగర్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రాజిరెడ్డి తెలిపారు.